# వ్యాస కౌముది



## చాటువులు

- దూర్వాసుల వేంకట సుబ్బారావు



**తెనుగు సాహిత్యం** ప్రత్యేకత పద్యమే. రామాయణ, భారత, భాగవతాది కావ్యాలు ప్రబంధాలు పద్యకావ్యాలే. కావ్య పరంగా కాక, ఆశువుగా, హాస్యధోరణిలో, సందర్భానుసారంగా పొగడినా, తెగడినా చెప్పిన పద్యాన్ని "చాటు"వందురు. చాటువనగా చాటుట. అనగా ఒక నిగూఢ నిజాన్ని, సత్యాన్ని ప్రజలకు తెలియజేయుటయే చాటుట. పూర్వం మన పల్లెలలో ఏదైనా ముఖ్యాంశాన్ని ప్రజలకు చాటించి తెలియజేసేవారు. సర్వసాధారణంగా చాటువులు స్వానుభవంపై ఆధారపడటం వల్ల, ఆశువుగా చెప్పటం వల్ల యతి నియమాలు, వ్యాకరణ దోషాలతో ఉండవచ్చు. ఇల్లు కొనేటప్పుడు పరిసరాలు ఎంత ముఖ్యమో, చాటువులకు సందర్భం, సమయం చాలా ముఖ్యం. అందుకే వేమన ఇలా అన్నాడు.

*ప్రస్తుతంపు వేళ పద్యంబు చెప్పుచో*
*తప్పు గలిగి యున్న నొప్పుయగును*
*బిత్తరి రతిలోన బిత్తలైయుండదా*
*విశ్వదాభిరామ వినురవేమ*

ఈ చాటువుల్లో ప్రసంగ పద్యాలు, పొగడ్త పద్యాలు, తిట్టు పద్యాలు, ప్రాస్తావికత పద్యాలు, సుభాషితాలు, శృంగార పద్యాలు, సమస్యపూరణాలు, అశ్లీల (బూతు) పద్యాలు ఉంటాయి. ఆంగ్ల భాషలో లిమరిక్కులు, డిట్టీలు, డాగరల్, మినిస్ట్రల్స్, గ్రూక్స్ మన తెలుగు చాటువుల్లాంటివే. ఆది భాష సంస్కృతంలో 'చాటు' అంటే పొగడ్త - రాజులను ఇంద్రుడు, చంద్రుడని ఆకాశానికి ఎత్తేసి, సంస్కృత శ్లోకాలతో కవులు ప్రస్తుతించేవారు. తమిళంలో 'చాటు' అంటే వాక్‌చాతుర్యం, 'చాటువర్' అంటే కవి. సంస్కృతం రాని వాళ్ళని, అరవంలో ఈ చాటువర్‌లు పొగిడేసేవారు, అవసరమైతే తిట్టేవారు కూడ.

చాటు కవిత్వానికి 'చిత్రకవిత' అన్నదొక మారుపేరు. అయితే ఈ చాటువులు అక్కడా, అక్కడా అడపా తడపా చెప్పబడుట వలన వీటిని సంకలనం, లేక కూర్పు చేయటం జరిగింది. ఈ సంకలనాల్లో ముఖ్యమైనవి:

మడికి సింగన (1430) సకలనీతి సమ్మతం, జగ్గన (1620) ప్రబంధ రత్నాకరం (వేటూరి ప్రభాకర శాస్త్రి గారి ప్రకటితము), దాసరి లక్ష్మణ స్వామి వర్ణన రత్నాకరం (కాశీనాథుని నాగేశ్వరరావు 1928-30లలో ప్రకటించినది), భట్టిప్రోలు రామచంద్రయ్య ఆంధ్రకవితా రత్నాకరం (1878), రంగయ్య శెట్టి (ఋతుచక్రం 1915), కూచిమంచి వెంకట రాయుడు (సుకవి మనోరంజనం), అడిదెము సూర కవి (కవి సంశయ ఏచ్ఛేదము) చాటుపద్య మణిమంజరి (వేటూరి ప్రభాకర శాస్త్రి 1917). మరల 1952, 1988ల్లో వేటూరి ప్రభాకర శాస్త్రి గారి చాటు పద్య మణిమంజరిని పెంపు చేసి ప్రచురించారు.

శ్రీ వేటూరి వారు పరిశోధనా గంగలో పట్టినదల్లా బంగారం, ముట్టినదల్లా ముత్యం. ఆంధ్ర లోకానికి శ్రీ అన్నమాచార్య కీర్తనా సాహిత్యాన్ని పైకి తీసుకు వచ్చి అమృత విందులు చేసిన తపస్వి, పూజ్యులు శ్రీ వేటూరి. వీరు మద్రాసు విశ్వవిద్యాలయ ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో పండితులుగా పనిచేసి 1950లో స్వర్గస్తులయ్యారు. వీరికి ఈ గ్రంథాలయంలో ఏ గ్రంథంలో ఏముందో నిద్రలో కూడా చెప్పగలిగే సామర్థ్యం ఉండేదట. వీరేశలింగం, గురజాడ సాహిత్య విషయాలపై శ్రీ వేటూరి వారితో సంప్రదించేవారట. వీరి చాటు పద్యమణి మంజరిలో 1823 రసగుళికలున్నాయి. మన తెలుగు సాహిత్యంలో కవుల సన్నివేశాలు, వారి సామాజిక, రాజకీయ విషయాల్ని ఎవ్వరూ వ్రాయనందున, వారి పీఠికల్లో, అవతారికల్లో ఉన్న చాటువులనే ఆధారంగా చేసుకుని వారి గురించి వ్రాయటం జరిగిందని శ్రీ ఆరుద్ర అభిప్రాయపడ్డారు. తొలుత చెప్పిన ఎనిమిది రకాల చాటువుల్నీ సమయానుకూలంగా సందర్భోచితముగా వివరిస్తున్నా.

పన్నెండవ శతాబ్దికి పూర్వం, కళింగరాజుకాలంలో కోపిలలో ముక్కోపి వేములవాడ భీమ కవి స్వకీయంగా ఏమన్నాడంటే

*ఉగ్రకోపి నేను నోపుదు శపియింప*
*గ్రమ్మరింప శక్తి గలదు నాకు*
*వట్టి మాన జిగురు పుట్టింప గిట్టింప*
*బిరుదు వేములాడ భీమకవిని.*

తన తిట్టు ఊరికే పోదు, అది రాముని బాణం, భీముని గధ, విష్ణు చక్రం కన్న మిన్న అని ఈ విధంగా శాపనార్థాలు పెట్టాడు:

*రాము నమోఘ బాణమును, రాజ శిఖామణి కంటి మంటయున్*
*దామర చూలి వ్రాతయును, దారక ద్వేషుఘోర శక్తియున్*
*భీము గదా విజృంభణ, మురేంద్రుని చక్రము, వజ్రి వజ్రమున్*
*వేములవాడ భీమ కవి వీరుని తిట్టును రిత్తవోవునే?*

కడ దారిద్ర్య బాధచే, బహుశః కోమట్లనుంచో, లేక కోమటి అనే అధికారినుంచో అప్పులు తీసుకుని, తీర్చలేని బాధతో ఇలా తిట్టాడు

*కోమటి నొక్క టిచ్చి పది గొన్నను దోసము లేద యింటికిన్*
*సేమ మెఱింగి... చిచ్చిన జెందద పాపము.*

వెంటనే ఇంకో పద్యములో కోమటి పక్షపాతివై

*కోమటికొక్కటిచ్చి పదిగొన్నను దోసము లేదటంటివా*
*కోమటి కొక్క టీక పది గొన్నను ధర్మము ధర్మ పద్ధతిన్*

అని సమర్థించుకున్నాడు ఈ భీమ కవి.

కవులను తగు రీతిలో సత్కరించని వారిని ఈ విధంగా భాస్కర మంత్రి శపించాడు:

*పద్యము చెప్పిన సుకవికి*
*హృద్యముగా నియ్యనట్టి హీనాత్ముని యా*
*పద్యమె పామై కఱచును*
*ప్రద్యోతితకీర్తి కాండ! భాస్కరుకొండా!*

❧ ❧ ❧

(కొనసాగింపు వచ్చేనెలలో)